క్లుప్తంగా

ప్రజావాణిలో ఫిర్యాదులు

పెద్దేముల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ కిషన్ తెలిపారు. ఇందూరు గ్రామానికి చెందిన సర్వే నంబర్ 56 వ్యవసాయ భూమి హౌజ్ సైడ్ (ఇల్లు)అని రికార్డులో రావడంతో దానిని వ్యవసాయ భూమిగా మార్చాలని అర్జీ ఇచ్చారు. మరో రైతుకు సంబంధించిన పట్టా పాసుబుక్ రాలేదని ఫిర్యాదు ఇచ్చారు. వీటిని పరిశీలిస్తామని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రాజీరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో ఇప్పటికే సీసీ రోడ్డు పనులను పూర్తి చేసినట్లు కో ఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న నాయకులు

యాలాల: పిడుగుపాటుకు గురై మృతి చెందిన జుంటుపల్లి, బెన్నూరు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తిమ్మాయిపల్లి భీమప్ప, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధితులను పరామర్శించి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తరఫున ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెన్నూరుకు చెందిన రైతు గొల్ల వెంటకప్ప, జుంటుపల్లికి చెందిన లక్ష్మప్ప, శ్రీనివాస్‌ల అకాల మృతి ఎంతో బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు.


ఉపాధి హామీ పేదలకు వరం



దార్గులపల్లిలో కూలీల పనులను పరిశీలిస్తున్న విఠల్

మర్పల్లి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పేద ప్రజలకు ఓ వరం లాంటిదని ఆ పథకం మండల ఈసీ విఠల్ అన్నారు. మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 11,400 ఉండగా అందులో 9,850 మంది కూలీలు పనుల కోసం డిమాండ్ పెట్టుకోగా సోమవారం 8,237 మంది ఉపాధి కూలీలు ఆయా గ్రామాలలో పనులు చేశారన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత రెండు వారాల నుంచి ప్రతి గ్రామంలో చెక్‌డ్యాంలలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మల్లకార్జునగిరి, బిలకల్, తుమ్మలపల్లి, దార్గులపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలు చేపడుతున్న చెక్‌డ్యాం మట్టితీత, వందురు కాలువ, ఫారంపాండ్స్ పనులను పరిశీలించారు. దార్గులపల్లిలో కూలీలు చేస్తున్న చెక్‌డ్యాం పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేసినట్లు ఈసీ విఠల్ తెలిపారు.

ఢిల్లీలో బీజేపీ నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న సదానందరెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి

అనంతగిరి: ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సదానందరెడ్డి, స్థానిక కౌన్సిలర్ టి.శ్రీదేవి ఢిల్లీలో ప్రచారం చేశారు. సోమవారం ఢిల్లీలోని కరోల్‌బాగ్, సుల్తాన్‌పురి, జల్మిల్, రంగాపురి, గోపాల్‌పురి, మహిపాల్పూరి, మయూర్ విహార్‌లో నివాసం ఉంటున్న తెలుగు ప్రజలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వామ్మో కుక్కలు!

- రోడ్లపై గ్రామ సింహాల స్వైరవిహారం
- చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్న శునకాలు
- రాత్రిళ్లు బయటికి రావాలంటే జంకుతున్న జనం



దౌల్తాబాద్‌లో రోడ్లపై తిరుగుతున్న శునకాలు



ఇటీవల కుక్కకాటుకు గురైన బాలుడు

దౌల్తాబాద్: రోడ్లపై తిరగాలంటే గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయి. వీధుల గుండా వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారు. ఇటీవల కుక్కకాటు ఘటనలు మండలం వ్యాప్తంగా కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో యథేచ్ఛగా వీధి కుక్కలు స్వైరవిహారం కొనసాగుతుంది. గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా కనిపించిన వారిపై దాడి చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడదతో జనాలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. నియంత్రణ లేక మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీల్లో శునకాల విహారం విపరీతమైంది. పట్టపగలే గ్రామ సింహాలు మనుషులు, మూగజీవాలు అనే తేడా లేకుండా దాడులకు ఉపక్రమిస్తున్నాయి. అయినా వాటిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

తరచూ ఘటనలు

మండలంలో తరచూ గ్రామ సింహాల దాడులు జరుగుతున్నాయి. ఇటీవల బాలంపేట గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ నర్సిములు కరెంట్ బిల్లుల కోసం తిరుగుతుండగా ఓ కుక్క వెనకాల నుంచి వచ్చి కరిచింది. అలాగే మండల కేంద్రంలో వారం రోజుల క్రితం ఈర్లపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా కాలును పట్టి ప్రతాపాన్ని చూపించింది. తాజాగా ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఐదేళ్ల చిన్నారి వెంకీగౌడ్ దుకాణం నుంచి వెళ్తుండగా పెంపుడు కుక్క కరవడంతో స్థానికులు మదనపడ్డారు. దీంతో చిన్నారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అలాగే పలు కాలనీల్లో, రోడ్ల వెంబడి వెళ్లే వాహనదారులను వెంబడించడంతో వారు కింద పడి గాయాల పాలయ్యారు. మనుషులతో పాటు వీధి కుక్కలు మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులపై సైతం దాడులు చేస్తున్నారు. దీంతో కొన్ని సార్లు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి.

పట్టించుకోని అధికార యంత్రాంగం

వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం వాటిని నియంత్రించడంలో విఫలమవుతుంది. మండలంలో కుక్కలు పట్టుకెళ్లే సిబ్బంది కొరతను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

షాక్ కొడుతున్నా.. పట్టించుకోరా?



విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభం వద్ద గ్రామస్తులు

పెద్దేముల్: మండలంలోని ఆత్కూర్ గ్రామంలో కరెంటు స్తంభాలకు షాక్ వస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. రెండు రోజుల క్రితం ప్రధాన రోడ్డు పక్కన 15 కేవీ మినీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ సక్రమంగా లేక ఓ మేక మృతి చెందడంతో స్థానికులు భయందోళనకు గురవుతున్నారు. అదే క్రమంలో గ్రామం మధ్యలో గతంలో భారీ స్ట్రీట్ లైట్ ఇనుప పోల్‌ను వేశారు. ప్రస్తుతం లైట్లు వెలగటం లేదు. కానీ చిన్నపాటి చినుకులు పడితే విద్యుత్ పోల్‌కు కరెంటు సరఫరా అవుతుంది. ఈ విషయాన్ని ఆత్కూర్ లైన్‌మెన్, హెల్పర్‌లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని, గ్రామంలో కరెంటుతో ఎవరైన మరణిస్తే తప్ప విద్యుత్ సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు అంజిలప్ప, గోపాల్‌తో పాటు పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

‘మిల్లర్ల మొండి వైఖరి మారాలి’



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీరేశం తదితరులు

యాలాల: అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు మొండి వైఖరి అవలంబిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం సీనియర్ నాయకుడు అగ్గనూరు వీరేశం అన్నారు. సోమవారం అగ్గనూరు శివారులో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది పెట్టరాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ కొందరు మిల్లర్ల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లు యజమాని కొద్దిగా తడిసిన ధాన్యాన్ని చూపించి, ధాన్యం బస్తాల లారీని వెనక్కిపంపించడం తగదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

జీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



జుంటుపల్లిలో రైతు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

యాలాల: పిడుగుపాటుకు గురై ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జుంటుపల్లి, బెన్నూరు గ్రామాల్లో పిడుగుపాటుకు గురై మృతి చెందిన రైతుల మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిడుగుపాటుకు గురై ముగ్గురు రైతులు ఒకే రోజు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, పటేల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు చేరువలో వైద్య సేవలు



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రజిత

మండల వైద్యాధికారి రజిత

దోమ: ప్రభుత్వ ఆస్పత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి రజిత అన్నారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు అన్ని రకాల వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని అన్నారు. గర్భిణులు, బాలింతలు, వివిధ రకాల వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలన్నారు. మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో తమ సిబ్బందితో ముందుకు వెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశాలు, స్టాఫ్‌నర్స్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటికి.. గంటల తరబడి కుస్తీ

మల్‌శెట్టిపల్లి తండాలో నీటి ఎద్దడి



నీటి కోసం మహిళల పడిగాపులు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌శెట్టిపల్లి తండాలో గత రెండు నెలలుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో తండావాసులు బిందెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అసలే ఎండా కాలం కావడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. ఈ క్రమంలో తండాలో ఉన్న రెండు డైరెక్టు పంపింగ్‌ల నుంచి నీరు సన్నగా వస్తుంది. మిషన్ భగీరథ నీటి పైపులు అక్కడక్కడా లీకేజీలు కావడంతో ఆ నీరు కూడా సక్రమంగా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. నీటి ఎద్దడి రెండు నెలలుగా ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు మండిపడుతున్నారు. తండాలో ఉన్న రెండు డైరెక్టు పంపింగ్‌ల వద్ద ఒక పంపులోంచి ఉప్పు నీరు వస్తుందని తాగడానికి పనికిరావడం లేదన్నారు. మరో పంపింగ్ వద్ద నీరు పట్టుకుందామంటే నీరు సన్నగా రావడంతో గంటల తరబడి బిందెలు పట్టుకొని వేచి చూడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిషన భగీరథ పైప్ లైన్లు సరి చేసి సక్రమంగా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. తండావాసుల సమస్యలు దృష్టిలో ఉంచుకొని ట్యాంకర్ల ద్వారా ఉదయం, సాయంత్రం వేళలో మంచి నీరు సరఫరా చేయాలన్నారు. లేనిచో పెద్దఎత్తున మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

యాలాల: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. కో ఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా, సీనియర్ నాయకుడు నాగయ్య ప్రజలకు మజ్జిగను అందించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రతి సోమవారం మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, నర్సింహులు, బస్వరాజ్, చందు, కిష్టప్ప, విజయ్, లాలప్ప తదితరులు ఉన్నారు.

పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

యాలాల: పంచాయతీ రికార్డులను ఆయా గ్రామాల కార్యదర్శులు సక్రమంగా నిర్వహించుకోవాలని ఎంపీడీఓ పుష్పలీల సూచించారు. సోమవారం ఎంపీఓ యాదయ్యతో కలిసి మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల పరిధిలో గల ఆస్తులు, భూముల వివరాలను పొందుపరుచుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు పని, మస్టర్‌ల నిర్వహణ, వంద శాతం పన్నుల వసూలు విషయాల్లో అలసత్వం వహించరాదన్నారు. పై పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్




కుల్కచర్ల: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ కచ్చితంగా చేస్తుందని, అదేవిధంగా రైతాంగ అభ్యున్నతికి అవసరమైన అనేక సంక్షేమ పథకాలను పార్టీ అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

వర్షం ధాటికి ఉల్లి.. కుళ్లి



కుప్పగా పోసిన ఉల్లిని ఆరబెడుతున్న రైతులు

- అకాల వానలతో దెబ్బతిన్న పంట
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



దార్గులపల్లిలో వర్షానికి పాడైన ఉల్లి

మర్పల్లి: ‘ఉల్లి చేసే మేలు తల్లి చేయదు’ అంటారు. కానీ వారం పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ధాటికి ఆ ఉల్లిని సాగు చేసే రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ఆదివారం మండలంలో ఆయా గ్రామాలలో కురిసిన భారీ వానలకు చేతికి వచ్చిన ఉల్లి పంట తమ కళ్ల ముందే పాడై పోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా మండల పరిధిలోని పంచలింగాల, తుమ్మలపల్లి, దార్గులపల్లి, బూచన్‌పల్లి, మర్పల్లి, వీర్లపల్లి, పట్లూర్, మొగిలిగుండ్ల, బిలకల్, కొంషెట్‌పల్లి గ్రామాలలో ఉల్లిని సాగు చేస్తారు. ఖరీఫ్, వేసవి పంటలుగా దీనిని సాగు చేసుకుంటారు. ఈ క్రమంలో వేసవి పంటగా ఉల్లి సాగు చేసుకుంటున్న రైతులకు ప్రకృతి శాపంగా మారింది. విపరీతమైన వానలు ఉల్లి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

పెట్టుబడులు రావడమే కష్టం

గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన ఉల్లి పాడవ్వడంతో రైతులకు పెట్టుబడులు సైతం రావడం లేదని వాపోతున్నారు. మండల పరిధిలోని దార్గులపల్లి గ్రామానికి చెందిన జావీద్, రాములు తమకున్న చెరి రెండు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. ఎకరాకు రూ.25 వేల చొప్పున ఇరువురూ 4 ఎకరాలకు గాను లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఐదు రోజుల క్రితం చేతికి వచ్చిన ఉల్లి పంటను కూలీలచే కోత కోయించారు. ఆదివారం కోత పనులు చేస్తుండగానే అకాల వర్షం పడి ఉల్లి పంట తడిసిపోయింది. దీంతో రైతులు తడిసిన ఉల్లిని పొలంలో కుప్పగా పోయించారు. భారీ వానకు ఉల్లిగడ్డలు కుళ్లిపోయాయని రైతులు వాపోయారు. ఉల్లి గడ్డలను విక్రయించుకుండా మానుకుంటే మార్కెట్ ధరలు పడిపోయాయి. కొన్ని రోజులుగా నిల్వ పెట్టుకొని ధర పలికినప్పుడు విక్రయించుకుందామనుకుంటే ఉల్లిగడ్డలు మురిగి పోతున్నాయని రైతులు విలపిస్తున్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసినట్లే ఉల్లిని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం!

వడగళ్ల వానతో కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

బొంరాస్‌పేట: అకాల వర్షం ఉమ్మడి బొంరాస్‌పేట మండలాన్ని అతలాకుతలం చేసింది. సోమవారం సాయంత్రం గంటకుపైగా భారీ వర్షం కురిసింది. బొంరాస్‌పేట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో ప్రారంభమై ఎడతెరిపి లేకుండా వాన పడింది. అక్కడక్కడా వడగళ్లు సైతం కురిశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్ కవర్లు కప్పి ఉంచడంతో నష్టాన్ని కొంత నివారించామని నిర్వాహకులు, రైతులు చెబుతున్నారు. దుద్యాల మండలం పోలెపల్లి, ఈర్లపల్లి, దుద్యాల మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. నారాయణపూర్, మల్కాపూర్, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. నారాయణపూర్ వద్ద విద్యుత్ స్తంభం కిందపడడంతో బషీరాబాద్‌కు సైతం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలిగింది. అదే విధంగా గోనూర్, చెంగోల్, బెల్కటూర్ వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. డీసీఎంఎస్ అధికారులు ధాన్యం బస్తాలు తూకం వేయకుండా ఆలస్యం చేయడంతో అకాల వర్షాలతో తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంపై ఏఈ వెంకట్‌నాయుడుతో మాట్లాడగా.. వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

కొడంగల్‌లో భారీ వర్షం

కొడంగల్: నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఆరబెట్టడానికి రోడ్లపై వేసిన వరి ధాన్యం పూర్తిగా తడిసింది. కొనుగోలు కేంద్రాల దగ్గర ఉన్న ధాన్యం సైతం తడిసినట్లు రైతులు వాపోయారు.



తాండూరు రూరల్: నారాయణపూర్‌లో ఇళ్ల మధ్య నేలకొరిగిన విద్యుత్ స్తంభం



బొంరాస్‌పేట: దుద్యాలలోని వాల్యానాయక్ తండాలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



బొంరాస్‌పేట: దుద్యాలలో ఓ ఇంటిపై విరిగిపడిన చెట్టు



బొంరాస్‌పేట: కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడవకుండా రైతుల పాట్లు



బొంరాస్‌పేట: దుద్యాలలోని పోలేపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం